# అమాయకుడు

ప్రతీ చేతగానివాడూ, పిరికివాడూ, అవకాశంలేనివాడూ 'ఆనెస్టీ', 'ఇంటెగ్రిటి' అంటూ నీతులు చెప్పేవాడే. లంచాలు, మామూళ్లు, అధికారం, పలుకుబడి లేకపోతే గవర్నమెంట్ ఉద్యోగం ఎవడిక్కావాలి! "Society prepares the crime and the criminal commits it" అన్నాడు టాల్‌స్టాయి. డబ్బులేనివాడికి సుఖసౌఖ్యాలు అనుభవించే అర్హత లేకుండా చేసింది సమాజం.

నేనేమీ మహాత్మాగాంధీని కాను దేశానుద్ధరించడానికి. సంపాదించుకోడానికే గవర్నమెంటు ఉద్యోగంలో చేరేను. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, సాయంత్రం భజనకెళ్లి తిరిగొచ్చేక మా అమ్మ పాతపాటే మొదలెట్టింది.

"పాపం! ఆ గోపీకి ఏదైనా ఆదరవు చూపెట్టండి, దిక్కులేని వాడు, కాస్తోకూస్తో చదువుకున్నవాడు, చక్కగా పాటలు పాడతాడు, తిండిలేక ఎండిపోతున్నాడు. మీరు పుణ్యం కట్టుకోవాలి మామ్మగారూ! అని అందరూ అంటున్నారు"అంది.

అలా అన్న అందరూ అసమర్థులేమీ కారు. 'మీ అబ్బాయి రెండు చేతులా సంపాదిస్తున్నాడు' అని మా అమ్మకి జ్ఞాపకం చెయ్యడమన్నమాట.

"వాణ్ణి ఇంట్లో పెట్టుకుంటే ఇల్లు దోచేస్తాడు. వాడు పచ్చిదొంగ. సర్టిఫయిడ్ స్కూల్లోంచి డిశ్చార్జి అయ్యేడని చెప్పేనుకదా! సర్టిఫయిడ్ స్కూలంటే జెయిలు. ఎన్నిసార్లు చెప్పమంటావు!"

"కూడు, గూడు, తోడు నీడలేనివాడు. వాడికి పాపం! దిక్కా మొక్కా! నేనేమీ ఎరగను మొర్రో అన్నా వాణ్ణి పోలీసులు కేసుపెట్టి, ఆ జెయిల్లో పడేసేరుట" అంది.

"వాడలా అనక ఏమంటాడు! వాడు ఇన్‌ఫర్మేషన ఇస్తే వాడు పనిచేసే పెట్రోల్ బంక్ గుమాస్తాని తన్ని పాతికవేలు దోచుకున్నారు. అంతక్రితం ఓ కిరాణాషాపులోనూ ఓ ఇరానీ హోటల్లోనూ పన్చేసేడు. రెండుచోట్లా వీణ్ని చావగొట్టి గెంటేసేరు".

"వాడలాంటివాడు కాదురా. వాడి మొహం చూసి చెపొచ్చు. అమాయకుడురా" అంటుండే కానీ నా మాట వినిపించుకోదు.

వీడి తండ్రి మా కోలనీలో వున్న వెంకటేశ్వరస్వామి టెంపుల్లో వాచ్‌మేన్ చేస్తూ ఏడాది క్రితం కేన్సరొచ్చి పోయేట్ట. వాడి తల్లి అక్కడే స్వీపరు. తండ్రి పోయి ఏడాదయింది. ఆర్నెల్ల క్రితం వీడి తల్లి ఎవడితోనో లేచిపోయిందిట.

"వీడికి పెద్దేనిమిదేళ్లున్నాయి. ఇంటర్ వరకూ చదువుకుని ఇక గత్యంతరంలేక చదువు మానేసి ఓ పెట్రోల్ బంక్‌లో ఓ గుమాస్తాగా చేరేట్ట.

చేరిన పదిరోజులకే పెంట్రోల్ బంక్‌లో ఓ రాత్రి దొంగతనం జరిగింది. వీడి తోటి గుమాస్తాని తన్ని పాతిక వేలు దోచుకుపోయేరు. వీడిచ్చిన ఇన్‌ఫర్మేషన్ మీదే చోరీ జరిగినట్టు పోలీసు దర్యాప్తులో తేలింది. డబ్బు దొరకలేదు. దొంగలు దొరకలేదు. వీడిలాంటి పని మళ్లీ చెయ్యకుండా పోలీసులు కేసు పెట్టి సర్టిఫయిడ్ స్కూల్లో మూడు నెలలు పడేసేరు. నెల్లాళ్ల క్రితం డిశ్చార్జ్ చేశారు.

పోనీ దగ్గిరెట్టుకుని ఏ కారు డ్రయివింగ్‌లైసెన్సో ఇప్పిస్తే ఉపయోగిస్తాడోమోనని వీణ్ణి గురించివాకబు చేస్తే తెలిసింది వీడి చరిత్ర. ఎరగ్రా బుర్రగా వుండి చూడ్డానికి అమాయకుడు లాగుంటాడు. దానికి సాయం భజనపాటలు పాడతాడు. దాంతో మహాభక్తుడని భజనమండలి వాళ్లు సర్టిఫికెట్ ఇవ్వడం, ఈవిడ నమ్మడం వాణ్ణింట్లో పెట్టుకోమని పోరు పెట్టడం ఇది మూడోసారి.

"వాడేమీ కుర్రాడు కాదు. మీ ఉద్యోగం గొడవలేమైనా పసిగట్టి ఇన్‌ఫర్మేషనిచ్చేడంటే ఈసారి ఉద్యోగం ఊడటమో మీరు జైలుకెళ్లడమో ఖాయం. వాణ్ణి ఇంట్లో పెట్టుకోడానికి చచ్చినా ఒప్పుకోను" అంది మా ఆవిడ.

రెండేళ్ల క్రితం ఎసిబి కేసులోంచి బయటపడ్డాను. 'ఈ ఇల్లెలా కొన్నావు? మీ పిల్లలిద్దరికీ డొనేషన్లెలా కట్టావు? చదువులెలా చెప్పించేవు? స్టేట్స్‌కెలా పంపేవు?' అంటూ సవాలక్ష ప్రశ్నలతో ఎంక్వయిరీ అయింది. సస్పెండవడం, జైలుపడటం, తర్వాత హైకోర్ట్ నామీద కేసు కొట్టెయ్యడం వివరాలెప్పటికప్పుడు పేపర్లో పడటంలాటి తతంగమంతా మూడేళ్లు పట్టింది.

సస్పెన్షన్ పీరియడ్‌లో రావల్సిన ఇంక్రిమెంట్లు, ప్రమోషనూ యథావిధిగా వచ్చేసేయి. అదంతా షరా మామూలే! మరి ఇంకో ఏడాదిలో రిటైరవ్వబోతూ ఇలాంటివాణ్ణి ఇంట్లో పెట్టుకుంటే కొరివితో తల గోక్కున్నట్టే! అంచేత ససేమిరా ఇంట్లో పెట్టుకోనన్నాను.

"పోనీలేరా. నేను గోపీని వెంటబెట్టుకుని రెండు నెలలపాటు తీర్థయాత్రలు చేసొస్తాను" అంది కృతనిశ్చయురాలై. కొద్దోగొప్పో ఆవిడది డబ్బు బేంక్ ఎకౌంట్‌లో వుంది. వొద్దన్నా నా మాట లెక్కచెయ్యదు.

"అమ్మా! అయిన ఆలస్యం ఎలాగా అయింది. మరో ఏడాది ఓపిక పట్టు. నేను రిటైరయింతర్వాత నీ వెంట వుండి తీర్థయాత్రలు చేయిస్తాం. చూస్తున్నావుగా మన సంసారం సమస్యలూ గొడవలూ!" అన్నాను బతిమాల్తూ.

"మన చిన్న సంసారానికే ఇన్ని గొడవలుంటే భగవంతుడికి విశ్వమంతా సంసారమే. మీకు ఆయన జ్ఞాపకమొచ్చీలోగా ఆయన నా ఆయుర్దాయం సంగతి మరిచిపోవచ్చు" అంది, అచ్చంగా నేననుకున్నట్లే.

"దిక్కులేనివాళ్లలాగ ముక్కూ మొహం తెలియనివాడిని వెంటబెట్టుకెళ్లడమేమిటండీ! ఊళ్లో వాళ్లు మమ్మల్ని గురించి ఏమనుకుంటారో ఆలోచించండి" అంది మా ఆవిడ.

"ఇన్నాళ్లూ దిక్కులేనిదాన్ని. ఇప్పుడు దేవుడి దిక్కుగా ప్రయాణం చేస్తున్నాను. అంతా ఆయనే చూసుకుంటాడు. ఇంక ఊళ్లోవాళ్ల అభిప్రాయమన్నావా! దీనివల్ల కొత్తగా మారిదేమీ లేదు" అంది పుల్లవిరుపుగా.

"పోనీ అలాగే వెదుదురుగాని. మెళ్లో గొలుసు, చేతికున్న గాజులు, మురుగులు తీసిక్కడ పెట్టుకుని వెళ్లండి. అవి కాజేసి మిమ్మల్ని ఎక్కడేనా వదిలేసి వెళ్లిపోయినా పోగలడు" అంది మా ఆవిడ. దాని అసలు భయం బయటపెడుతూ.

"చూడుపద్మా! ఆత్మాభిమానానికి రెండే రెండు శత్రువులు. ఒకటి దరిద్రం. నా కూడా వస్తున్న వాడికి దరిద్రం కర్మమేమిటి! రాజులాగ చూసుకుంటాను. రెండోది దురాశ. వాడికి దురాశ లేదు. మొన్న రెండువందలు చేతిలో పెడితే, 'ఉంచండి అమ్మమ్మగారూ! కావల్సినప్పుడు అడిగి తీసుకుంటాను' అన్నాడు.

అలాగ మీ ఆయన ఎప్పుడైనా ఎవరితోనైనా అన్నాడో లేదో నాకు తెలీదు" అంది నావైపు తిరుగుతూ. నేను ఆవిడ కళ్లు తప్పించుకోవడం గమనించకపోలేదు.

"మా భయం మాది. ముందుజాగర్త కోసం చెప్పేను" అంది మా ఆవిడ, ఊరుకోమని నేను సౌంజ్ఞ చేస్తున్నా లెక్కచేయకుండా.

"ముందు జాగర్త చూసుకునే బయల్దేరుతున్నాను. ఇంక భయమంటారా! వీడు కాకపోతే మరొకడు నా పీక పిసికి నగలు డబ్బూ పట్టుకుపోయేడనుకో- మరీ మంచిది. తీర్థయాత్రలోనే నా అంతిమయాత్ర కూడా అయిపోతుంది" అంది మా ఇద్దరి నోళ్లూ మూయిస్తూ.

నిజం చెపొద్దూ! మా అమ్మా నాన్నా కూడా కాస్త వేదాంత ధోరణి వున్న పూర్వకాలపు మనస్తత్వాలు కలవాళ్లు. మా నాన్న పోయి పదిహేనేళ్లయింది. ఆయన వున్నంతకాలం

నా సంపాదన, ఖర్చుకూడా పరిమితంగా వుండేవి. ఆ తర్వాత రోజులు మారిపోయేయి. పిల్లలు చదువులు, అవసరాలు, అభిరుచులు, సరదాలు, ఉద్యోగంలో ఒదుదుడుకులు, పైవాళ్లు, ఆపైవాళ్లు, ఖర్చులు, పైఖర్చులు పెరిగిపోయేయి.

మా పద్ధతులు ఆవిడకి నచ్చకపోయినా మేము మారే స్థితిలో లేమని ఆవిడకి తెలుసు. మా తల్లిదండ్రులకి నేనొక్కణ్ణే సంతానం. ఆవిడ దానధర్మాల ద్వారా చుట్టుపక్కలవాళ్లంతా ఆవిడ ఆత్మబంధువులే. లేకపోతే ఏనాడో మమల్ని విడిచిపెట్టి ఏ ఆశ్రమానికో వెళ్లిపోయేది.

ఉత్తరాది యాత్రలు పూర్తిచేసుకుని మా అమ్మా గోపీ రెండు నెలల్లో తిరిగొచ్చేరు.

ఈలోగా గోపీ పనిచేసిన పెట్రోల్ బంక్‌లో జరిగిన దొంగతనం కేసు కొత్త మలుపు తిరిగింది.

తన్నులు తిన్నాడనుకున్న గుమాస్తాగాడే ఆ డబ్బుకాజేసేట్ట. అంతేకాదు, వాడు మహాభక్తుడులాగ టెంపుల్‌కెడుతూ, గోపీకి ఉద్యోగం ఇప్పిస్తానని ప్రోమిస్ చేసి ప్రొప్రయిటర్ దగ్గిరకి గోపీ తల్లిని తీసుకెళ్లి ఉద్యోగం ఇప్పించి తన మంచితనంతో నమ్మకం కలిగించి, ప్లాన్ ప్రకారం, గోపీకి ఏక్సిడెంటయిందని చెప్పి మరో ఇద్దరి సహాయంతో, వర్షంలో గోపీ తల్లిని ఏకాంతప్రదేశానికి తీసుకుపోయి, సినిమాకథ ఫక్కీలో, సామూహిక అత్యాచారం చేసి చంపేసి శవాన్ని మాయంచేసినట్టు పోలీసు దర్యాప్తులో తెలిసింది.

దీంతో ఇన్నాళ్లూ భక్తుడని ఆదరించిన గోపీని, భజనమండలివాళ్లు, ఈ యాత్రాఫలితంగా తన నిజస్వరూపాన్ని నిరూపించుకున్న కారణజన్ముడిగా ఆరాధించడం మొదలెట్టేరు.

ఇప్పుడు వాడు మా అమ్మకి దత్తపుత్రుడు. ఇంకా ఏ మాత్రం బ్యాంక్ బేలన్స్ మిగిల్చేడోకానీ, నాకు వాడు సవితిపోరుగా తయారయ్యేడు. నేను భయపడ్డట్టే ద్విగుణీకృత నూతనోత్సాహంతో మా అమ్మ దక్షిణాదియాత్రలకు బయల్దేరింది.

నేను మా మినిష్టర్ వెంట కాన్ఫరెన్స్‌కి ఢిల్లీ వెళ్లేను. ఆ టైంలో మా ఆవిడ దగ్గిర్నుంచి టెలీఫోనొచ్చింది. మా అమ్మకి తిరుపతిలో వుండగా హార్టెటాకొచ్చి నాలుగు రోజుల క్రితం దేవస్థానం హాస్పిటల్లో పోయిందిట. గోపీ హైదరాబాద్ మా ఇంటికి ఫోన్ చేసేడుట కానీ ఆ రోజునే మా ఆవిడ స్నేహితుల్తో నాగార్జునసాగర్ వెళ్లడంచేత కబురు తిరిగొచ్చేక కానీ తెలియలేదు.

ఏమైతేనేం! అంతా అయిపోయింది. గోపీయే ఆమెకి తలకొరివి పెట్టేడు. ఈ శనిగాడు దాపరించకపోయినట్టయితే ఆవిడకీ దిక్కులేని చావు, అర్ధాంతరంగా తీర్థయాత్రలూ, అదుపూ పొదుపూ లేని ఖర్చు, మాకీ అప్రతిష్ట వుండేవి కావు.

నేను ఢిల్లీ నుంచి తిరిగొచ్చాక గోపి కలిసి మిగిలిపోయిన ట్రావెలర్స్‌చెక్కులూ, డెత్ సర్టిఫికెట్టూ, మా అమ్మకి వైద్యం చేసిన డాక్టర్ వాసుదేవన్ రాసిన సంతాప లేఖ పట్టుగొచ్చిచ్చేడు.

ఆమె కోరికమీదనే ఆమె నగలు హుండీలో వేసేసేట్ట, కేష్ ఏమీ మిగల్లేదుట. వాడు నిమజ్జనం చేయ్యగా మిగిలిన అస్థికలపాత్ర మాత్రం పదిలంగా పట్టుకొచ్చి ఇచ్చేడు.

"నేను అనుమానించినట్టే అయింది. యాత్ర పేరు చెప్పి ఆ లక్ష రూపాయల నగలు వాడికి కైంకర్యం! పైగా వీడు చేసిన ఘనకార్యానికి బహుమానం ఇచ్చి సత్కరించలేదని భజనమండలిలో సంతాపసభ అనంతరం గుసగుసలు!" అంది మా ఆవిడ. మా అమ్మ పోయిన రెండు మూడు నెలలతర్వాత భజనమండలి కూడా మూతపడింది.

రిటైరయిన రెండేళ్లలో జీవితం అస్తవ్యస్తంగా తయారయింది. నాలుగు తరాలకి కావల్సినంత డబ్బు సంపాదించేను. ఏం లాభం! తినలేను పెట్టలేను దాచలేను అన్నట్టుగా వుంది.

పెద్దాడక్కడే పెళ్లిచేసుకుని సెటిలైపోయేడు. రెండోవాడి పెళ్లే గొడవల్లో పడింది. కారణాలు ఏమైతేనేం డైవోర్స్ ప్రొసీడింగ్స్ నడుస్తున్నాయి.

ఆ అమ్మాయి పేరెంట్స్ విజయవాడలో వున్నారు. వాళ్లని కల్సుకుని ఏదైనా కాంప్రమైజ్ వీలుపడుతుందేమో ప్రయత్నిద్దామని విజయవాడొచ్చేను. హోటల్ లాబీలోకి అడుగెట్టగానే "నమస్కారం సర్!" అంటూ పలకరించినవాడెవరా అని పరకాయించి చూసి ఆనవాలు పట్టి "గోపీ" అన్నాను.

ఆ హోటల్ ప్రొప్రయిటర్ నాకు చిరపరిచితుడు.

"నీకీ కుర్రాడు తెలుసా?" అని అడిగేడు.

"బాగా తెలుసు" అన్నా కాస్త వ్యంగ్య ధోరణిలో. గోపీ నా సూట్‌కేస్ అందుకుని, నేను రిజిస్టర్‌లో సంతకం పెట్టేక, రూం కీ తీసుకుని నాతో రూంలోకొచ్చి "సర్. ఇక్కడ రెండు నెలల నుంచి రూంబోయ్‌గా పనిచేస్తున్నాను. మీరొక్క మాట చెబితే నా ఉద్యోగం కన్‌ఫర్మ్ అవుతుంది" అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు.

నేను స్నానంచేసి బట్టలు మార్చుకుని సూట్ కేస్ లాక్‌చేసి బ్రీఫ్‌కేస్‌లో తాళం పడేసి బయట కొచ్చేను. వాడుబయట కారిడార్‌లో వెయిట్‌చేస్తున్నాడు. ఎక్కడలేని వినయం ప్రదర్శిస్తూ నా చేతిలో రూంకీ తీసుకుని, రూం లాక్‌చేసి లిఫ్ట్‌లో కిందకొచ్చి కౌంటర్‌లో కీ ఇచ్చేసి బయటకొచ్చేక టేక్సీ పిలిచి నన్ను పంపించేడు.

రాత్రి నేను తిరిగి వచ్చేటప్పటికి పదయింది. ప్రొప్రయిటరూ, మేనేజరూ కౌంటర్‌లోనే వున్నారు. ప్రొప్రయిటర్ గోపీని గురించి అడిగేడు. వాడి చరిత్ర చెప్పేను. మర్నాడే వాణ్ని పీకి పారెయ్యమని మేనేజర్‌కి చెప్పేడు.

"మీ భోజనం రూంలో పెట్టించేను" అన్నాడు మేనేజర్.

"నేనేమీ పెట్టించమనలేదే! భోంచేసొచ్చేను" అన్నాను.

అప్పుడు తెలిసింది అసలు సంగతి. నేను టేక్సీ ఎక్కిందాకా వుండి కౌంటర్ దగ్గిరకొచ్చి మేనేజర్‌తో "బ్రీఫ్‌కేస్ మరిచిపోయేరుట. తెమ్మన్నారు.... రాత్రి రావడం లేటవుతుంది భోజనం రూంలో పెట్టించమన్నారు" అని చెప్పి రూం కీ తీసుకుని పైకి వెళ్లి అయిదు నిమిషాల్లో బ్రీఫ్‌కేస్ తీసుకునికీ కౌంటర్‌లో ఇచ్చేసి బయటకెళ్లేడుట.

వెంటనే ముగ్గురం పైకెళ్లేం. బ్రీఫ్‌కేస్‌లో పెట్టిన సామాన్లు, కాగితాలు మంచం మీదున్నాయి. సూట్‌కేస్ తెరిచి వుంది. అందులో వున్న పదివేల రూపాయలకట్టలోంచి రెండు వేలూ, దాంతో బాటు ఓ షర్టూ, ఫ్యాంటు, బనీను, పంచా మాయమయ్యాయి.

బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకు పారిపోయుంటాడు. వాడి 'డే' డ్యూటీ ఏడింటికయిపోయింది, బ్లడీ రోగ్! తలగడా మీద హడావిడిగా రాసిన చిన్న కాగితంలో వున్న ఆ మహాభక్తుడి సందేశం ఇది....

"నా దురదృష్టం రూపంలో మీరిక్కడ ప్రత్యక్షమయ్యేరు. నాకీ ఉద్యోగం పోవడం ఖాయం. ఇప్పుడిక్కడనుంచి ఇలాగే ఊరు విడిచి పోతున్నాను. ఎక్కడికో తెలీదు. ఇదే మొదటిసారి పరుల సొత్తు అపహరించడం. గత్యంతరం లేదు. ఎప్పటికైనా, నా కాళ్లమీద నేను నిలబడి సంపాదించుకున్ననాడు మీ సొమ్ము వాపస్ చేస్తాను. లేకపోయినా మీకీ సొమ్ము ఓ లెక్కలోనిది కాదు. గోపీ"

ఈ సొమ్ము మీకో లెక్కలోనిది కాదు అంటే ఏమిటి వీడి ఉద్దేశం! రాస్కెల్. వెంటనే పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలన్నాడు మేనేజర్. అసలు నేనొచ్చిన పనే అవమానంతో కృంగదీసింది. దానికి సాయం పోలీస్ కేసొకటా! వొద్దు పొమ్మన్నాను.

మనశ్శాంతి కోసం అక్కణ్ణుంచి బయల్దేరి తిరుపతి వెళ్లేను. మర్నాడు తిరిగొచ్చే ముందర 'కర్టిసీకాల్'గా డాక్టర్ వాసుదేవన్‌ని కలిసేను. రెండేళ్ల క్రితం జరిగిన సంఘటన సులంభగానే జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

మా అమ్మకి హార్టెటాక్ వొచ్చింతర్వాత తేరుకుని పన్నెండు గంటలుందిట. మళ్లీ 'మాసివ్ ఎటాక్' వచ్చి పోయిందిట. ఆ ఇంటర్వెల్‌లోనే తను మరణిస్తే తన వస్తువులు హుండీలో వేసెయ్యమనీ, తనే తన అంత్యక్రియలు చేసెయ్యమని గోపీకి చెప్పినప్పుడు డాక్టర్ వున్నాడుట.

తను పేష్కర్‌కి లెటరిచ్చి వార్డ్‌బోయ్‌ని సాయం ఇచ్చి టెంపుల్‌కి పంపిహుండీలో వేయించేడుట. ఆయన గోపీని మరీ పొగుడుతుంటే విజయవాడ సంఘటన గుర్తుకొచ్చి వినలేకపోయేను.

వార్ధక్యం నిజంగా సుదీర్ఘం దర్భురం అయిన మానసిక కారాగారశిక్ష. నా ఆలోచనలలో నేను బందీని. ఉరుకులు పరుగులు పెట్టే ఈ సమాజంలో తూలుతూ తుళ్లుతూ నడిచే బాటసారిని. ఒకనాడు ప్రముఖుణ్ణి. ఈనాడు ఎవరికీ అక్కర్లేని ఏకాకిని. నన్ను పలకరించేవాళ్లు, నేను పలకరించేవాళ్లు నాలాంటి ఖైదీలే. మా గతవైభవం గురించీ నేటి వ్యధల గురించీ మేము చెప్పుకుంటుంటే వినేవాళ్లు మాకు కావాలి.

ఒకనాడు ప్రశంసలతో పరవశించేవాణ్ణి. ఈనాడు పలకరింపుకే మొహం వాచేను.

మారెండోవాడు మానసికంగా దెబ్బతిని తాగుడికి, రహస్యంగా డ్రగ్స్‌కి అలవాటుపడి చివరకి ఆరేళ్ల క్రితం పోయేడు.

మా ఆవిడకి అప్పట్లో బైపాస్ సర్జరీ అక్కర్లేదన్నారు. ఇప్పుడవసరమన్నారు. మళ్లీ స్టేట్స్‌కి వెళ్లింది. ఏం చేస్తుందీ! ఇక్కడ చావు భయం. అక్కడ బ్రతుకంటే భారం. పిల్లలకి మనం అక్కర్లేకపోయినా పిల్లలు మనకి కావాలి. పెంచిన మమకారం అలాంటిది!

ఇలా ఆలోచించుకుంటూండగా పోస్ట్‌మేన్ ఇన్స్యూర్డ్ కవర్ పట్టుకొచ్చేడు.

హృషీకేశ్‌లో వేద వ్యాస ఆశ్రమం నుంచి గోపీ పంపేడు. చింపి చూశాను. దాంట్లో ఆరువేల రూపాయలతో బాటు ఉత్తరం వుంది.

"…. రెండేళ్ల క్రితం అయిదు వేలు మీ పేర పంపేను. మీరు 'అవుటాఫ్ కంట్రీ' అన్న పోస్టల్ ఎండార్స్‌మెంట్‌తో కవర్ వాపసొచ్చింది. ఈసారయినా అందుకుంటారన్న ఆశతో ఆరువేలు పంపుతున్నాను. ఎనిమిదేళ్ల క్రితం మీకు చెప్పకుండా మీవద్దనుంచి

రెండు వేలు తీసుకెళ్లేను. మీకు గుర్తుండుంటుంది. మీ మేలు మరవలేను. ఈ డబ్బుతో మీ రుణం తీర్చుకోలేను.

మీ అమ్మగారే నాకు తల్లి తండ్రీ గురువుగా పెట్టిన జ్ఞానభిక్షతో ప్రభావితుడనై ఐహికబంధాలలో చిక్కుకోకుండా మానవసేవ చెయ్యాలన్న అభిలాషతో యోగాభ్యాసం చేసి ఇక్కడ విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహిస్తూ ఆశ్రమజీవితం ఆనందంగా కొనసాగిస్తున్నాను..."

ఆనందంగా జీవిస్తున్నాడట. ఎందుకు జీవించడు! సాగితే ఆధ్యాత్మికమంతటి సుఖమైన జీవనోపాధి మరోటి లేదు. "Religion is the opium of people" అన్నాడు కార్ల్‌మార్క్స్. దైవం మీద నమ్మకం కుదిరినవాడు అదృష్టవంతుడు. అంతా ఈశ్వరేచ్ఛ అంటాడు. తన కోరిక నెరవేరిందా 'because of God' అంటాడు, నెరవేరలేదా 'Inspite of God' అని సమాధానపడతాడు. వాడేమైనా కష్టపడి సంపాదించిన సొమ్మా! పైగా ఖర్చులేని వ్యాపారం. సాధన బాగానే వున్నట్టుంది. వడ్డీతో సహా పంపేడు.

రెండేళ్ల క్రితం మా పెద్దాడికి కొడుకు పుట్టేడంటే చూడ్డానికి వెళ్లేం. పది రోజులు తర్వాత ప్రతిరోజూ ముళ్లమీద వున్నట్టే వుంది. తిరిగి వెడతామంటే వెళ్లొద్దన్నవాళ్లులేరు. సొంత కొడుకింట్లోనే మోస్ట్ మోడర్న్ ఓల్డేజ్ హోంలో వున్నట్టుంది. ఏం కావలిస్తే అవన్నీ వున్నాయి, ఒక్క ఆదరణ, ఆప్యాయత, గౌరవం తప్ప.

మేము తిరిగొచ్చేస్తున్న రోజున– "ఏమీ అనుకోకండి. ఇక్కడ మీకేమీ తోచదు. డబ్బు పోగుచేసి మాకివ్వాలనుకోకండి. మీరు ఇండియాలో వుంటూ హాయిగా డబ్బు ఖర్చు పెట్టుకోండి. కావలిస్తే ఇంకా పంపుతాం" అన్నాడు మావాడు.

వాడి తప్పులేదు. జీవిత విలువలు కాలంతో బాటు మారడం సహజం. గోపీని కాకుండా మమ్మల్నే నమ్ముకుంటే మా అమ్మ తీర్థయాత్రలు చెయ్యకుండానే పోయి వుండేది.

శరీరాలే శాశ్వతం కానప్పుడు వాటికి పరిమితమైన బంధుత్వాలు శాశ్వతమా! ఇప్పుడు మా అమ్మ కోసం నాన్న కోసం ఏమాత్రం బెంగెట్టుకున్నాను! ఎవరికెవరు కావాలి!

అక్కడ మా ఆవిడ ఆరోగ్యం, శారీరకంగా బాగానే వుందిట. ఇక్కడ నా ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది. 'ఊఁ' అంటే చాలు డాక్టర్లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, నర్సింగ్‌హోంలు, గోతికాడ నక్కల్లాగ, దోచెయ్యడానికి సిద్ధంగా వున్నారు. బంధువుల్ని,

స్నేహితుల్నీ నమ్మడానికి లేదు. 'ఇయ్యి' అనేవాడే కానీ 'ఇంద' అన్నవాడు లేడు. ఎవ్వర్నీ నమ్మడానికి లేదు.

మళ్లీ స్టేట్స్‌కి వెడదామనుకుంటుంటే "నేనే తిరిగొచ్చేస్తున్నాను. మీర్రావొద్దు. మన ఇల్లు అమ్మేసి ఇండియాలో ఏ మారుమూల ఆశ్రమంలోనైనా ఓ కాటేజ్ చూడండి. అక్కడికి పోయివుందా" మని పద్మ ఫోన్ చేసింది. గోపీ ఉత్తరం జ్ఞాపకమొచ్చి మా ఆవిడ చెప్పిన ఆశ్రమం అయిడియాని గురించి సీరియస్‌గా ఆలోచించాలనిపించింది.

ఆశ్రమంలో వుండలగలమా! అక్కడ ఏ సౌఖ్యాలుంటాయి! కానీ ఏ మారుమూల ఆశ్రమంలోనో వుందామని పద్మ రాసింది. రిటైరయింతర్వాత మోస్ట్ అప్టుడేట్ ఫెసిలిటీస్‌తో చక్కని ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు ఏం జెసుకోం ఈ ఇల్లు!

"మా కోసం డబ్బు పోగుచేసుకోక హాయిగా ఖర్చుపెట్టుకోండి, కావలిస్తే ఇంకా పంపుతాను" అన్నాడు మా అబ్బాయి. హీ ఈజ్‌రైట్. మమ్మల్ని పట్టుకు వేళ్లాడకండి, మీ దారి మీరు చూసుకోండి అంటున్నాడు.

ఎప్పటికైనా వాడి కొడుకూ వాణ్ణి ఏదో రోజున అలాగే అంటాడని వాడికీ తెలుసు. మా మమకారమే మా శత్రువు. అక్కడుంటే ఇక్కడికి రావాలనిపిస్తుంది. ఇక్కడున్నప్పుడు అక్కడికెళ్లి వాళ్లతో వుండాలనిపిస్తుంది. అందరూ వున్నా ఎవరూ లేని వాళ్లం– అందరూ తనవాళ్లే అనుకుంటూ గోపీ పట్ల పెంచుకున్న మా అమ్మ అనురాగంలో అసలైన వైరాగ్యం వుంది. దురాశే నన్ను పిశాచంలాగ వెంటాడి ఆత్మాభిమానాన్ని చంపింది.

ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ గెస్ట్‌హౌస్‌లో దిగేను. బద్రినాథ్‌కేదారానాథ్‌లలో సంవత్సరంలో ఆర్నెల్లుకంటే వుండలేమని తెలిసి హృషీకేశ్‌లో వున్న ఆశ్రమాల వివరాలు సేకరిస్తున్నాను. రాత్రి తొమ్మిది దాటింది. బయట హోరున వర్షం.

మేనేజర్ కాశీపతి ఫోన్‌చేసాడు–

"సారీ టు డిస్టర్బ్‌యు... పద్మనాభరావుగారని హైదరాబాద్‌లో ఎడిషనల్ చీఫ్ సెక్రటరీ చేసి రిటైరయ్యేరు.."

"అవును నాకు తెలుసు"

"రేపు మధ్యాహ్నం వెళ్లిపోతారు. రూమ్సు ఖాలీ లేవు. మీది డబుల్‌రూం. ఒక్కరే వుంటున్నారు కనుక మీకభ్యంతరం లేకపోతే..." అంటూ నసుగుతున్నాడు.

"అదికాదండి. ఇంత అర్థరాత్రి ఆయన ఎక్కణ్ణుంచి ఊడిపడ్డాడు! ఆయన ఎదురుగుండా మీరిలా అడిగితే..."

"ఆయన ఏడాది నుంచి హృషీకేశ్‌లో వేదవ్యాస్ ఆశ్రమంలో వుంటున్నారు. పనిమీదహైదరాబాద్ వెళుతూ..."

"సరే. రమ్మనండి" అన్నాను. అక్కడ ఆశ్రమ విశేషాలు తెలుసుకుందామన్న సహజ కుతూహలంతో మెత్తబడి.

పద్మనాభరావు నాకుబాగా జూనియర్. రెండేళ్ల క్రితం రిటైరయ్యేడు. ఒక కొడుకు ఢిల్లీలో వున్నట్లు, ఒక కొడుకు ఇరాన్‌లో వున్నట్లు, పెద్ద కూతురు డాక్టర్, స్టేట్స్‌లో వుందనీ, రెండో కూతురు అల్లుడూ హైదరాబాద్‌లోనే 'లా' ప్రేక్టీస్ చేస్తున్నట్టు చెప్పేడు. భార్యాసమేతంగా హృషీకేశ్‌లో వుంటున్నాడుట. నెల్లాళ్ల క్రితం భార్య హైదరాబాద్ వెళ్లి భర్తని కూడా తిరిగి వొచ్చెయ్యమంటుందిట.

"ఏం! ఆశ్రమ వాతావరణం బాగా లేదా?"

"ఆశ్రమ వాతావరణం ప్రశాంతంగా వుంది. స్వామీజీకూడా శాంతమూర్తి. ఆశ్రమ నిర్వహణలోనే రాజకీయాలు ప్రవేశించేయి"

"అవునుకానీ, అక్కడ గోపీ అని ఒక హైదరాబాద్ కుర్రాడు.."

"వాడేనాకు సమస్యయ్యేడు. నాకు మనశ్శాంతి లేకుండా చేసేడు."

"ఏంచేసేడు?"

"వాడేమీ చెయ్యలేదు. వాడు ఏడెనిదెళ్ల క్రితం ఏక్‌నాథ్ గుప్తా అన్న కోటీశ్వరుడి ఆశ్రయంతో ఆశ్రమంలో ప్రవేశించేడు. యోగాభ్యాసం చేస్తూ విద్యార్థులకిప్పుడు యోగాటీచర్‌గా వున్నాడు. గుప్తాకి వాడంటే ప్రాణంట. రెండేళ్ల క్రితం ఆశ్రమానికో కోటి రూపాయలు విరాళం ఇచ్చి వీడికో పది లక్షలిచ్చి పోయేడు.

ఆ పది లక్షలు గోపీ ఆశ్రమానికే ఇచ్చేసేడు, చాలా మంచివాడు, సేవాతత్పరుడు, చక్కని గాత్రంతో భజనపాటలు పాడతాడు. దాంతోస్వామీజీకి, ఆశ్రమవాసులకీ వాడంటే ఎంతో అభిమానం. నాకూ అభిమానమే.

ఈ ఏడాదినుంచీ ఆశ్రమం ట్రస్ట్ మేనేజ్‌మెంటంతా నేనే చూస్తున్నాను. మరి ఎవరి ప్రోద్బలమో తెలీదు స్వామీజీ అతనికి ట్రస్ట్ మేనేజ్‌మెంట్ అప్పగించి నన్ను సలహాదారుడిగా వుండమన్నారు.

ఇటీవల వాడు నాకు ఏకు మేకై నాకే పాఠాలు చెప్పే స్థితికొచ్చేడు"

"మిగిలిన మెంబర్లు ఈ విషయం గమనించలేదా?" అని అడిగాను.

"అందరూ వాణ్ణే సపోర్ట్ చెయ్యడం మొదలెట్టారు. ఇన్నాళ్లూ నా మాటకెదురులేదు. నాకున్న క్వాలిఫికేషన్, అనుభవం ముందర వాడి చదువు, సంస్కారం, వయస్సు, అనుభవం ఏపాటి! నాకు తలకొట్టేసినట్టుంది".

"స్వామీజీ ట్రస్ట్ విషయంలో కలుగజేసుకోరా?" అన్నాను.

"వాడి నిర్ణయాలనే సమర్థిస్తున్నారు. ఈ అవమానం భరిస్తూ మనమిక్కడ ఎందుకు! మనకేమీ జీతం బత్తెం ఇస్తున్నారా! పోదాం అంటూ నా వైఫ్ నెల్లాళ్ల క్రితం కూతురు దగ్గిరకెళ్లింది"

"గోపీ ఏమైనా మిమ్మల్ని అవమానించేడా?"

"వాడసలు వాదించడు. వాడి అభిప్రాయం చెబుతాడు. స్వామీజీ వాడే రైటంటారు. స్వామీజీ అసలు ఆలోచిస్తారనుకోను. నేను చెప్పింది కాదంటారు అంతే..."

"స్వామీజీతోవెళ్లదల్చుకున్నానని చెప్పేవా?"

"చెప్పేను. నీ అంతకి నువ్వొచ్చేవు. నువ్వు తప్పు చేసేవని నేనెన్నడూ అనలేదు. తప్పో రైటో ఆశ్రమ నిర్వహణ బాధ్యత, నిరహంకారంతో, నిస్వార్థబుద్ధితో పనిచేసే యువకుడికి అప్పగించడం నా అభిమతం. ట్రస్ట్ కార్యక్రమాల నిర్వహణ ఒక బాధ్యత. ఇది పదవీ కాదు. దీనికి అధికారం అక్కర్లేదు. నువ్వు వెళ్లదల్చుకుంటే వెళ్లవచ్చు. ఈ ఆశ్రమ ద్వారాలెప్పుడూ తెరిచే వుంటాయి. నువ్వెప్పుడయినా మళ్లీ తిరిగి రావచ్చు' అన్నారు స్వామీజీ"

"ఇప్పుడు హైదరాబాద్‌లో సెటిలవుతారా?"

"ఉద్యోగం కావాలంటే కాళ్లదగ్గిరకొస్తుంది. సంపాదన మీద కోరిక లేదు. మనశ్శాంతి కోసం ఆశ్రమాన్ని ఆశ్రయించేను. ఆత్మాభిమానాన్ని చంపుకుని అక్కడ వుండలేను. కొన్నాళ్లు హైదరాబాద్‌లో వుంటాం, లేదా దేశాలు తిరుగుతాం పిల్లల వెంట. అదీ బాగాలేకపోతే మరో ఆశ్రమం చూసుకుంటాం" అన్నాడు కృతనిశ్చయుడై.

స్వామీజీ ఆంతర్యం నాకు అర్థమైంది. పద్మనాభరావు అహంకారం మీద దెబ్బకొట్టడానికే గోపీకి అంత ప్రాముఖ్యత ఇచ్చి వుంటారు. తనది తనవాళ్లూ అనే

మమకారం, తను తన హోదా అనే అహంకారం నాలాగే విడిచిపెట్టలేక అశాంతికి గురైన అమాయకుడు పద్మనాభరావు. మేము తిన్న దెబ్బలు అతనూ అతని భార్య తినలేదు. అనుభవం చాలదు. చెప్పినా వినడు.

గోపీని గురించి ఆలోచించేను. ఏమీ లేకపోయినా ఎవరూ లేకపోయినా అందిరనీ మెప్పించగల మంచితనమున్న సగటు మనిషి. అహంకారాన్ని, అత్యాశనీ, దరిచేరనియ్యలేదు. ఎవరూ లేరనుకున్న గోపీకి అందరూ తనవారే అయ్యేరు, చివరికి స్వామీజీ కూడా.

మర్నాడు బయల్దేరి హృషీకేశ్ వెళ్లి గోపీని కలుసుకోడానికి నిశ్చయించుకున్నాను. హృదయం ప్రశాంతతతో నిండిపోయింది.

** స్వాతి, అక్టోబరు 1995*